
ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం


బాల వికాసం

పుట్టపర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సన్నిధిలో బాల వికాస్ చిన్నారులు సంగీత, నృత్య ప్రదర్శనలతో అలరించారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో రెండోరోజు బుధవారం డాన్గిన్ నృత్య ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచింది. గుజరాత్ సంప్రదాయ సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను తన్మయత్వంలో ముంచాయి. రామాయణంలోని ఘట్టాలను అద్భుతంగా ప్రదర్శించారు. ప్రదర్శనల అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

కూటమిపై కోటి ఆశలు..!

నష్టపోయాం: రాజు, శిరిగారిపల్లి రైతు, ముదిగుబ్బ మండలం
గతంలో టీడీపీ ప్రభుత్వం రాయితీపై రైతులకు వ్యవసాయ యంత్రాలు అందించేది. వైసీపీ అధికారం చేపట్టాక అటకెక్కించింది. దీంతో చాలా నష్టపోయాం. కూటమి ప్రభుత్వం పరికరాలు అందించి, ఆదుకోవాలి.





వ్యవసాయ యంత్రాల కోసం రైతుల ఎదురుచూపు

- పట్టించుకోని వైసీపీ పాలకులు
- కొత్త ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్న ఆశాభావం



అతివృష్టి, అనావృష్టి, ధరలతో వ్యవసాయం భారంగా మారింది. వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలు వలసబాట పట్టారు. అన్నదాతకు అండగా నిలవాలన్న ఉద్దేశంతో టీడీపీ హయాంలో వ్యవసాయ యంత్ర పరికరాలను సబ్సిడీపై అందజేశారు. దీంతో కూలీల అవసరం తీరి, పెట్టుబడులు కూడా తగ్గడంతో అన్నదాతకు ఉపశమనం దక్కింది. ఆ తరువాత అధికారం చేపట్టిన వైసీపీ ఆ పథకాలను అటకెక్కించింది. రైతు సంఘాలను ఏర్పాటు చేసి, నామమాత్రంగా అందజేసింది. అవి కూడా.. వైసీపీ అనుకూలురు వశమయ్యాయి. రైతులకు ఉపయోగమే లేకుండా పోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. వ్యయసాయ పరికరాలు సబ్సిడీపై అందించి, ఆదుకోవాలని కోరుతున్నారు.

ముదిగుబ్బ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పొలాలను దుక్కి దున్నడం, విత్తనాలు వేయడం నుంచి పంట ఉత్పత్తులను అమ్ముకునే వరకు ప్రస్తుతం వ్యవసాయం రంగంలో పలు రకాల యంత్ర పరికరాలు తప్పనిసరి అయ్యాయి. కరువు జిల్లాలో వర్షాభావం కారణంగా అనేక మంది కూలీలు వ్యవసాయ రంగాన్ని వీడి, పొరుగు రాష్ట్రాలకు ఉపాధి కోసం వలస వెళ్లారు. దీంతో ఉన్న రైతులకు వ్యవసాయ కూలీలు దొరక్క తప్పనిసరిగా యంత్రాలపై ఆధారపడాల్సి వచ్చింది. వారిని ఆదుకునేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం సబ్సిడీతో పలు వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రధానంగా స్ప్రేయర్లు, రెయిన్ గన్లు, రోటావేటర్లు, నాగళ్లు, విత్తన గొర్రులు, గుంటక, టార్పిన్లు, రైతులకు రాయితీపై ఇచ్చింది. రైతు రథం పేరుతో వ్యక్తిగతంగా రాయితీపై ట్రాక్టర్లు అందించింది. రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి ఆదుకుంది. ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందే మండలాల వారీగా లక్ష్యాలను నిర్ణయించి పరికరాలను నాటి పాలకులు అందుబాటులో ఉంచేవారు. దీంతో నాడు అనేకమంది రైతులు వ్యవసాయ రంగంపై ఆశలు పెంచుకున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం
పలు సమావేశాల్లో వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేయాలని రైతులు అడుగుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.
-రవీంద్ర, వ్యవసాయాధికారి, ముదిగుబ్బ మండలం

వైసీపీ నిర్లక్ష్యం

వైసీపీ ఐదేళ్ల పాలనలో రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. వ్యక్తిగత వ్యవసాయ పరికరాలను అందించిన దాఖలాల్లేవు. వ్యవసాయ యంత్రాల పంపిణీకి మంగళం పాడింది. అంతేకాకుండా గతంలో టీడీపీ ప్రభుత్వం.. రైతు సంక్షేమం కోసం అమలు చేసిన పలు పథకాలను అటకెక్కించింది. వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేసింది. ముదిగుబ్బ మండలంలో వరి, వేరుశనగ, కంది, ఉలవ, మొక్కజొన్న, మిరప, టమోటా వివిధ రకాల పంటలను 17వేల మంది రైతులు 62 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మండలంలో 21 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. అప్పట్లో ఆర్‌బీకే పరిధిలో ఐదుగురు రైతులను గ్రూపుగా ఎంపిక చేసి, ట్రాక్టర్, ఇతర పరికరాలను అందిస్తామని వైసీపీ ప్రభుత్వం చెప్పింది. కొన్ని ఆర్‌బీకేల్లో మాత్రమే తూతూమంత్రంగా పరికరాలను అందించి.. చేతులు దులుపుకుంది. అందులో వైసీపీ నాయకులు చెప్పిన వారికే యంత్రాలు అందాయి. గ్రూపులకు ఇచ్చిన ట్రాక్టర్లను కొందరు సొంతానికి వాడేసుకున్నారు. దీంతో అసలైన రైతులకు అన్యాయం జరిగింది. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ పాత పథకాలను పునరుద్ధరిస్తుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

యంత్రాలను ఇవ్వాలి



టిల్లర్లు, గుంటక సేద్యానికి గంటకు వెయ్యి రూపాయలదాకా ఖర్చవుతోంది. 5 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. ట్రాక్టర్ బాడుగలకే చాలా వెచ్చించాల్సి వస్తోంది. రాయితీపై యంత్రాలు ఇస్తే ఆ భారం తగ్గుతుంది. రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలి.
-చంద్రశేఖర్, రైతు, ఎస్ బ్రాహ్మణపల్లి, ముదిగుబ్బ మండలం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, జేసీ

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ కోరారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జేసీ మౌర్య భరద్వాజ్‌తో కలిసి వర్షాలపై అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. వర్షాల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కోరారు. వర్షాలు కురుస్తున్నప్పుడు చెట్లు, హోర్డింగుల కింద, పాడుబడ్డ భవనాలు, పాత మిద్దెలలో ఉండరాదని అన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు తీసుకొనేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. నదులు, వాగులు, వంకల పారే రోడ్లు దాటే ప్రయత్నం చేయకుండా చూడాలని అన్నారు. నీటి వనరుల వద్ద ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. కల్వర్టులు, బిడ్జిలు, రహదారులు పాడైపోయే అవకాశం ఉందని, తగు చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ, పీఆర్ అధికారులకు సూచించారు. డ్రైనేజీలలో నీరు బ్లాక్ అయ్యే ప్రదేశాలను గుర్తించి వెంటనే క్లియర్ చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఒక్కొక్క మండలానికి ఒక్కొక్క ప్రత్యేక అధికారిని నియమించాలని ఇన్‌చార్జి డీఆర్వో సూర్యనారాయణ రెడ్డికి సూచించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

ఏపీ విపత్తుల నిర్వహణ శాఖ సూచనల మేరకు పుట్టపర్తి కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసేలా 08555-289039 నంబరుతో కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేశారు. వర్షాలకు సంబంధించిన సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు తెలియజేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

ముసురు భయం

జడివానకు తడిసిన మొక్కజొన్న

అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షం

- ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం
- తడిసిపోతున్న మొక్కజొన్న ధాన్యం
- రంగు మారితే రైతులకు భారీ నష్టం


గార్లదిన్నె వద్ద అరబోసిన మొక్కజొన్న ధాన్యం తడవకుండా టార్పాలిన్ కప్పిన రైతులు

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)
అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి జిల్లాను ముసురు కమ్ముకుంది. దాదాపు అన్ని మండలాల్లో మంగళవారం వర్షం కురిసింది. ఆకాశం బుధవారం ఉదయం నుంచి మేఘావృతమైంది. అనంతపురం, యాడికి, గార్లదిన్నె, నార్పల మండలాల్లో బుధవారం మోస్తారు వర్షం కురిసింది. పుట్లూరు, విడపనకల్లు, తాడిపత్రి, పామిడి తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. అత్యధికంగా ఆత్మకూరులో 3.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఉరవకొండ 3.5, బెళుగుప్ప 3, గుంతకల్లు 2.1, డి.హీరేహాళ్, విడపనకల్లు 2.0, నార్పల 1.7, బొమ్మనహాళ్, గుత్తి 1.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 1.1 సెంటీమీటర్లలోపు వర్షపాతం నమోదైంది.

భారీ వర్షాలకు అవకాశం

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి జిల్లాలోని ఒకటి రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం హెచ్చరించినట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణ స్వామి తెలిపారు. ఈ అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశలో పయనించి, వాయుగుండంగా మారుతుందని తెలిపారు. ఈ సమయంలో పలు చోట్ల ఈదరుగాలుతో కూడిన వర్షం, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. పలు చోట్ల గంటకు 25 కి.మీ. నుంచి 30 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. రైతులు

(మిగతా 6వ పేజీలో...)

ఖాద్రీశుడి సన్నిధిలో మాతంగ మహాపీఠాధిపతి


లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న మాతంగ మహాపీఠాధిపతి

కదిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మాతంగ మహాపీఠాధిపతి మాతంగ నందగిరి స్వామీజీ బుధవారం సందర్శించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను పీఠాధిపతి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అంతకుముునుపు మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి నివాసంలో గిరి ప్రదక్షిణ గురించి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, బీజేపి నాయకులు తలుపుల గంగాధర్, రామకృష్ణ, దన్విత్, రవిచంద్రనాయుడు, కిష్టప్ప , గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు బుల్లెట్ రైళ్లు
350 కి.మీ. వేగాన్ని తట్టుకునేలా రైలు మార్గం
వివరాలు 7లో...

వంద క్వింటాళ్ల ధాన్యం..



మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. విత్తనం ఆరబెట్టుకుని బళ్లారి మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించాలని భావించాను. వర్షానికి వంద క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయింది. మళ్లీ ఆరబెట్టుకునేందుకు నానా తిప్పలు పడుతున్నాము. నెల క్రితం క్వింటం ధర రూ.2500 వరకూ పలికింది. ఇప్పుడు రూ.1700 అన్నా కొనేవారు లేరు. తడిసిన పంటను ఏ వ్యాపారీ ముట్టుకోడు. వాళ్లు ఎంతకి అడిగితే అంతకు ఇవ్వాల్సిందే. నాకు రూ.1.5లక్ష నష్టం వచ్చింది. పెట్టుబడి కూడా రాదు.

- దశరథరెడ్డి, హావళిగి

ఈ కష్టం పగవాడికి కూడా వద్దు..



మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. కంకిని మిషన్‌కు ఆడించి విత్తనాన్ని ఆర బెట్టుకున్నాను. రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. కింద, పైన టార్పాలిన్ కప్పినా ఫలితం కనిపించడం లేదు. అరగంట ఆరబెడితే చాలు వర్షం మొదలౌతోంది. ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదు. ఈ కష్టం పగవారికి కూడా రాకూడదు. దాదాపుగా 90 క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయింది. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

-నరసింహా రెడ్డి, హావళిగి

ముసురు భయం

(5వ పేజీ తరువాయి)

అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తడిసిన మొక్కజొన్న

గార్లదిన్నె మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న పంట దెబ్బతింటోంది. గార్లదిన్నె, కల్లూరు, సిరివరం, బూదేడు, కృష్ణాపురం, యర్రగుంట్ల, సంజీవపురం, మర్తాడు, కొట్టాలపల్లి, అంకంపేట, గుడ్డాలపల్లి తదితర గ్రామాల్లో సుమారు 600 మంది దాదాపు 1600 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశారు. పంట కోతకు వచ్చింది. ఈ సమయంలో జడివానలు కురుస్తుండటంతో రైతులు కోత కోయాలంటే భయపడుతున్నారు. ఇప్పటికే కోత కోసి, కల్లాలు, జాతీయ రహదారి పక్కన ఆరబోసిన ధాన్యం తడిసిపోతోంది. కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు తీయాల్సి వస్తోంది. ధాన్యంపై టార్పాలిన్ పట్టలు కప్పడంతోగాలి, వెలుతురు సోకక గింజల రంగు నల్లగా మారుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

50 టన్నుల ధాన్యం..

విడపనకల్లు మండలంలోని హావళిగి, గడేకల్లు, ఆర్ కొట్టాల, ఉండబండ, చీకలగురికి, పొలికి, అంచనహాలు గ్రామాల్లో మొక్కజొన్న ధాన్యం తడిసి ముద్దైంది. గడేకల్లులో 67వ జాతీయ రహదారికి ఇరువైపులా అర కిలోమీటరు వరకూ మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబెట్టారు. హావళిగి పాఠశాల మైదానంలో వంద మందికి పైగా రైతులు ధాన్యాన్ని ఆరబెట్టారు. విత్తనం తడవకుండా కింద, పైన టార్పాలిన్‌లు కప్పి ఉంచారు. కానీ భారీ వర్షాల కారణంగా నీరు లోపలికి వెళుతోంది. తడిసిన ధాన్యాన్ని రైతులు బకెట్లలో నింపి బయట మరోచోట ఆరబోస్తున్నారు. టార్పాలిన్‌పై నిలిచిన వర్షపు నీటిని బట్టలలో అద్ది బకెట్లలో పిండి ఎత్తిపోస్తున్నారు. మండలంలో 50 టన్నులకు పైగా మొక్కజొన్న ధాన్యం తడిసిపోయింది. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



విడపనకల్లు మండలంలో వర్షానికి తడిసిన మొక్కజొన్న ధాన్యం



మొక్క జొన్న ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

అప్పులు తీరుతాయనుకుంటే..



గార్లదిన్నెలో 9 ఎకరాల భూమిని రూ.2 లక్షలకు కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగుచేశాను. ఎకరానికి రూ.40 వేల వరకూ పెట్టుబడి పెట్టాను. దిగుబడి బాగా వచ్చింది. అప్పులు తీరుతాయని సంతోషపడ్డాం. కానీ ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసిపోయింది. రంగు మారితే ధర పలకదు.

- రామాంజనేయులు, సిరివరం

ధర తగ్గించారు..



మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశాను. పంటకోసి ఆరబోశాం. వర్షానికి మొత్తం తడిసిపోతోంది. టార్పాలిన్ పట్టలు కప్పినా ఫలితం కనిపించడం లేదు. గింజలు తడిస్తే వ్యాపారులు కొనుగోలు చేయరు. మొన్నటి వరకు క్వింటం ధర రూ.2,200 ఉండేది. ఇప్పుడు రూ.1,800 ఇస్తామంటున్నారు.

- గోపాల్, సిరివరం

ఆదుకోవాలి..



ఏ పంట సాగు చేసినా నష్టం వస్తోంది. అందుకే మొక్కజొన్నతో మేలు జరుగుతుందని రైతులందరం ఆసక్తి చూపించాము. వర్షానికి పంట దెబ్బతినింది. రూ.లక్ష వెచ్చించి 3 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశాను. కోత సమయంలో వర్షాలు పడుతున్నాయి. మా అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

- గంగాధర్, సిరివరం

ధర్మవరంలో తనిఖీలు

- ఎస్పీ ఆధ్వర్యంలో సోదాలు
- 85 ద్విచక్రవాహనాలు, 4 ఆటోలు సీజ్

ధర్మవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 8 మంది సీఐలు, 10 మంది ఎస్ఐలు, 156 మంది సిబ్బంది ఒక్కసారిగా తనిఖీలకు దిగడంతో ధర్మవరం దద్దరిల్లింది. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ధర్మవరం, పెనుకొండ డీఎస్పీలు హేమంత్‌కుమార్, నరసింగప్ప, సీఐలు, ఎస్ఐలతో కలిసి ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం సోదాలు నిర్వహించారు. ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నేర చరిత్ర ఉన్నవారికి ఎస్పీ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. రౌడీషీటర్ల ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులతో మాట్లాడి మంచి ప్రవర్తనలో నడుచుకునే విధంగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. తుపాకులు కలిగి ఉన్నారన్న సమాచారంతో ప్రతి ఇంటినీ సోదా చేశారు. నంబరు ప్లేట్లు, రికార్డులు లేని వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... కార్డెన్ సెర్చ్‌లో భాగంగా ఎవరూ తప్పించుకోకుండా 16 బృందాలు ఏర్పాటుచేసి, రెండు డ్రోన్ కెమెరాలు, బాడీవన్ కెమెరాలు, మొబైల్ స్కానింగ్ చెక్ డివైజ్‌లను వినియోగించామన్నారు. మొబైల్ స్కానింగ్ ఫింగర్ ప్రింట్ డివైజ్‌లు వినియోగించి, పాత నేరస్తుల డేటా సేకరించామన్నారు. ఆరుగురు రౌడీషీటర్లు, 8 మంది సస్పెక్ట్ షీట్లు కలిగిన వారిని గుర్తించి పరిశీలించామన్నారు. 25 ఏళ్ల క్రితం నేరాలు చేసిన వారు కూడా కాలనీలో ఉన్నారన్నారు. ప్రశాంతంగా బతకాలని వారికి సూచించామన్నారు. 15ఏళ్లుగా ప్రశాంత జీవనం సాగిస్తున్న వారిపై రౌడీషీట్లను తొలగిస్తామన్నారు. రాత్రి సమయాల్లో తాగి గొడవలు, అల్లర్లు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై రౌడీషీట్లు తెరుస్తామన్నారు. నంబర్ ప్లేట్లులేని 85 ద్విచక్రవాహనాలు, 4 ఆటోలను సీజ్ చేశామన్నారు. ఇందిరమ్మ కాలనీలో 4 సీసీ కెమెరాలు ప్రస్తుతానికి ఉన్నాయనీ, మరో 10 ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలిపారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ

నిర్లక్ష్యంపై చర్యలు తప్పవ్

పీఏసీఎస్ అధికారులపై ఎమ్మెల్యే పరిటాల సునీత అసంతృప్తి

అనంతపురం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విస్తృతస్థాయి సమావేశానికి పూర్తి సమాచారంతో కాకుండా నిర్లక్ష్యంగా వస్తే చర్యలు తప్పవని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి పరిధిలోని సొసైటీల సీఈఓలు, బ్యాంకుల అధికారులు, ఉద్యోగులపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోవాలని సూచించారు. బుధవారం మండలంలోని ఆర్ కన్వెన్షన్ హాల్‌లో రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని పీఏసీఎస్‌ల పాలకవర్గం, సంఘం సిబ్బంది, ఏడీసీసీ బ్యాంకు మేనేజర్లు, సూపర్‌వైజర్ల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్ హాజరయ్యారు. సొసైటీల సీఈఓలు తమ పరిధిలోని రైతులు, రుణాలు, ఇతరత్రా వాటి గురించి తెలియజేశారు. ఇందులో కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లికి సంబంధించిన అధికారులు సరైన వివరాలు వెల్లడించకపోవడం పట్ల ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు కూడా అధికారులు నిబంధనలు అంటూ అడ్డు చెబుతున్నారని పలువురు సొసైటీల చైర్మన్లు ప్రస్తావించారు. వైసీపీ హయాంలో అక్రమంగా ఇచ్చిన రుణాలపై విచారణ చేయాలన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముట్టిమండుగు కేశవరెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో అనువుగాని చోట గోదాములు కట్టారన్నారు. కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చడానికే వాటిని నిర్మించారన్నారు. అవన్నీ బ్యాంకులకు భారంగా మారాయన్నారు. కొండగుట్టల్లో కడితే వాటిని ఎలా వినియోగించుకోవాలో అర్థంకావట్లేదన్నారు. త్వరలోనే వన్‌టైం సెటిల్‌మెంట్ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖ, డీజీఎం రాంప్రసాద్, రాప్తాడు నియోజకవర్గంలోని సింగిల్ విండో అధ్యక్షులు లక్ష్మీనారాయణ, పాములాయి రఘు, కృష్ణమోహన్ చౌదరి, నరసింహులు, నెట్టెం వెంకటేశ్వర్లు, ముత్యాలు, గోపాల్, లింగన్న, బ్రహ్మానందరెడ్డి, కన్వీనర్లు జింకా సూర్యనారాయణ, కొండప్ప, శ్రీనివాసులు, ముత్యాలురెడ్డి, సీనియర్ నాయకులు రామ్మూర్తినాయుడు, సుధాకర్‌నాయుడు, రంగయ్య, దండు ఓబులేసు, వేణుగోపాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

నెట్టికంటి ఆలయంలో హనుమద్దీక్షలు

గుంతకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీక పాడ్యమి తిథిని పురస్కరించుకుని కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తులు హనుమద్దీక్షలను చేపట్టారు. ప్రతి సంవత్సరం హనుమద్ మాలను ధరించే భక్తులు కసాపురం ఆలయానికి వచ్చి కార్తీక మాస ప్రారంభ తిథిన మండల దీక్షలు, ఇరభై రోజుల తర్వాత అర్ధ మండల దీక్షలను స్వీకరిస్తారు. ఈ మేరకు బుధవారం ఉదయం వేకువజామునే కాషాయ వస్త్రాలను ధరించి కసాపురం ఆలయానికి వచ్చిన భక్తులచే ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా హనుమద్ మాలలను తొడిగి, మంత్రోపదేశం చేసి హనుమద్దీక్షలను ప్రారంభించారు. దీక్షలను చేపట్టిన భక్తులు ప్రదక్షిణలు చేసి, స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. నవంబరు 11వ తేదీన అర్ధ మండల దీక్షా కార్యక్రమాన్ని ఆలయంలో నిర్వహించనున్నారు. కసాపురం దేవస్థానంతోపాటు, వివిధ ఆలయాల్లో మండల, అర్ధ మండల దీక్షలు చేపట్టిన మాలాధారులు డిసెంబరు 2వ తేదీన ఇరుముడులతో నెట్టికంటి సన్నిధికి తరలివస్తారు. డిసెంబరు 3న దేవస్థాన ప్రాంగణంలో చేపట్టే హనుమద్ వ్రతంలో పాల్గొని మాలలను విసర్జించి, దీక్షలను విరమిస్తారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్స్ కోసం ఎదురుచూపు..!

- ఉద్యోగోన్నతులు వచ్చినా తప్పని నిరీక్షణ
- మిగిలిన జిల్లాల్లో ముగిసిన ప్రక్రియ
- సీనియార్టీ కోల్పోతామని ఉద్యోగుల ఆందోళన

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగోన్నతులు కల్పించినా.. ప్లేస్‌మెంట్స్ కోసం పంచాయతీరాజ్‌శాఖ ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇప్పటికే ప్రక్రియ ముగించడంతో వారికంటే సీనియర్లుగా ఉన్నవారు తదుపరి ఉద్యోగోన్నతుల్లో జూనియర్స్ అయిపోవాల్సి వస్తోందని మదనపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలువురు గ్రేడ్-1 కార్యదర్శులతో పాటు వీడీఓ (విలేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) కేటగిరిలో ఇద్దరు, డీపీఓ కార్యాలయం ప్యానల్ నుంచి మరో సీనియర్ అసిస్టెంట్‌కు డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఈ నెల 11న పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ క్రిష్ణతేజ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉత్తర్వులు వెలువడి పది రోజులు పూర్తయినా ప్లేస్‌మెంట్స్‌కు సంబంధించి జిల్లా అధికారుల్లో ఉలుకు పలుకు లేదన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఆయా మండలాలకు సంబంధించి స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి కొందరు లేఖలు కూడా సమర్పించినట్లు సమాచారం. ఆ మేరకు అనంతపురం జిల్లాలోని నాలుగు మండలాలకు సంబంధించిన డిప్యూటీ ఎంపీడీఓలకు బుధవారం ప్లేస్‌మెంట్స్ కేటాయిస్తూ డీపీఓ ఉత్తర్వులు జారీ చేశారు. సత్యసాయి జిల్లాకు సంబంధించి అతీగతీ లేకుండా పోతోందని బాధిత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగోన్నతి పొంది.. ప్లేస్‌మెంట్స్ కోసం ఎదురు చూస్తున్న వారి వివరాలు ఇలా ఉన్నాయి.



ఉద్యోగి పేరు	ప్రస్తుత స్థానం	జిల్లా/మండలం కేటాయింపు..
అశోక్ కుమార్	ఆకుతోటపల్లి	రాప్తాడు
గోపాల్	పామిడి	బెళుగుప్ప
రమణ	బొమ్మనహాల్	తాడిపత్రి
చంద్రశేఖర్	సీకే పల్లి	బ్రహ్మసముద్రం
శ్రీనివాసరెడ్డి	కొత్తచెరువు	సత్యసాయి
ప్రవీణ్‌కుమార్	నారాయణపురం	సత్యసాయి
ముత్యాలరెడ్డి	గార్లదిన్నె	సత్యసాయి
ప్రేమ్‌కుమార్	రాప్తాడు	సత్యసాయి
అబ్దుల్ మునాఫ్	కాలసముద్రం	సత్యసాయి
సాదిక్ అలీ	బుక్కపట్నం	సత్యసాయి
సుధాకర్ కుమార్	అమరాపురం	సత్యసాయి
బాబురావు	రొళ్ల	సత్యసాయి
వెంకటేశ్వరప్రసాద్	గుత్తి	అన్నమయ్య
మనోహర్	డీపీఓ కార్యాలయం	సత్యసాయి
ఎమ్ఎల్ఎన్ ప్రసాద్	కణేకల్లు	సత్యసాయి

సిసలైన పండగ..!

- డీఏ, అలవెన్సుల విడుదలపై ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల హర్షాతిరేకాలు
- జేఏసీల ఆధ్వర్యంలో ఆనందోత్సాహాలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీపావళి పండుగకు ఒకరోజు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఒక డీఏతోపాటు ఇతర అలవెన్సులను విడుదల చేయడంపై ఆయావర్గాలు హర్షం వ్యక్తంచేశాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల జేఏసీ నాయకులతో చర్చలు జరపడం, వారి సమక్షంలోనే డీఏ, పలు డిమాండ్లపై సానుకూలంగా స్పందించడంపై వారు సంతోషపడుతున్నారు. 60 రోజుల్లో హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపేందుకు కమిటీని ఏర్పాటు చేసి, ఇన్సూరెన్స్ విధానంపై పరిశీలనకు ఆదేశాలు జారీ చేయడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చైల్డ్‌కేర్ లీవ్ అవకాశాన్ని మహిళా ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వరకూ పొడిగించడంపై వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హెల్త్ కార్డుల విషయంలో ప్యాకేజీ రేట్లు పెంచడం, జిల్లా ఆస్పత్రుల్లో చికిత్స పరిమితిని రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచడం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు.. సీఎం చంద్రబాబునాయుడు చిత్తశుద్ధి చాటుకున్నారని ప్రశంసలు కురిపిస్తున్నారు.

మిగిలిన డీఆర్, క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను పెంచి ఆదుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన డీఏ, అలవెన్సుల విషయం ఆనందం కలిగించే విషయం. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన విధంగా పెన్షనర్లకు డీఏను ఇచ్చింది. గత వైసీపీ ప్రభుత్వం తగ్గించిన క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను పెంచి ఉంటే బాగుండేది. అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలను చర్చలకు పిలిచి, అభిప్రాయాలు సేకరించడం సంతృప్తినిచ్చే అంశం. భవిష్యత్తులో పెన్షనర్లకు సంబంధించి డీఆర్‌లు, క్వాంటం ఆఫ్ పెన్షన్ పెంపుపై ప్రకటన చేస్తారనే నమ్మకం ఉంది.

-పెద్దన గౌడ్, ఏపీ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

జేఏసీ నేతలకు గౌరవమివ్వడం గర్వంగా ఉంది



సీఎం చంద్రబాబునాయుడు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై జేఏసీ నేతలను స్వాగతించి, గౌరవించడం పట్ల గర్వంగా ఉంది. వైసీపీ ప్రభుత్వంలో ఒక్కసారి కూడా ఉద్యోగ సంఘాలను సమస్యలపై చర్చించేందుకు పిలిచిన దాఖలాల్లేవు. డీఏ విడుదల చేయడంతోపాటు 2004కి ముందు రిక్రూట్ అయిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం ఆయావర్గాల్లో నమ్మకం కలిగించింది.

-మనోహర్ రెడ్డి, ఏపీఎన్జీల సంఘం నగర అధ్యక్షుడు

చర్చలు జరపడం ఆనందంగా ఉంది..



ఉద్యోగ సంఘాల నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేరుగా చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించడం ఆనందంగా ఉంది. డీఏను విడుదల చేయడంతోపాటు పోలీసు అధికారులకు సంబంధించి సరెండర్ లీవ్‌లు చెల్లించడానికి అంగీకారం తెలపడం శుభపరిణామం. ఉద్యోగ సంఘాల నేతల అభిప్రాయాలను సేకరించడం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ గౌరవంగా ఫీలవుతున్నారు. మిగిలిన డీఏలను విడుదల చేసి, ఉద్యోగులకు బాసటగా నిలవాలి.

-తోట చెన్నప్ప, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మహిళా ఉద్యోగులకు చంద్రబాబు అండ..



మహిళా ఉద్యోగులకు సీఎం చంద్రబాబునాయుడు అండగా నిలబడ్డాడు. చైల్డ్‌కేర్ లీవ్‌లు (180 రోజులు) రిటైరయ్యే వరకూ పొందే అవకాశం కల్పించడం మహిళా ఉద్యోగుల్లో స్థైర్యం నింపింది. హెల్త్ కార్డుల విషయంలో ప్యాకేజీ రేట్లు పెంచడం భరోసా ఇచ్చింది.

-ఉమాదేవి, మహిళా విభాగ నగరాధ్యక్షురాలు, ఏపీఎన్జీఓల సంఘం

కరువు నేలలో కృష్ణమ్మ పరవళ్లు

మడకశిర, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): కరువు నేలలో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. నీటి వనరులే లేని మడకశిర ప్రాంతంలో కృష్ణాజలాలు ఉరకలు వేస్తున్నాయి. హంద్రీనీవా కాలువ ద్వారా గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేస్తున్నారు. ఆ నీరు మండలంలోని మణూరు చెరువుకు చేరడంతో పూర్తిగా నిండిపోయింది. బుధవారం మరువ పోయింది. హరేసముద్రం చెరువుకు కృష్ణాజలాలు చేరుతున్నాయి. మడకశిర ప్రాంతంలోని మరిన్ని చెరువులను నింపనున్నట్లు హంద్రీనీవా అధికారులు చెబుతున్నారు. మూడేళ్లుగా సరైన వర్షాలు కురవక చేరువులో నీరులేక భూగర్భజలాలు అడుగంటిపోయి తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందనీ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆవేదన చెందారు. ప్రస్తుతం కృష్ణాజలాలతో చెరువు నిడడంతో తాగు, సాగు నీటి సమస్య పరిష్కారం కావడమేకాక బోర్ల కింద భూములు కూడా సాగులోకి వస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతేడాది నియోజకవర్గంలో పర్యటించినపుడు ఈ ప్రాంతంలోని చెరువులను కృష్ణాజలాలతో నింపి.. తాగు, సాగునీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేరుస్తూ నీటితో చెరువులను నింపుతుండడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



కృష్ణాజలాలతో మరువ పారుతున్న మణూరు చెరువు

నత్తల దండు..!

పంటలో కుప్పలుగా నత్తలు



లక్షలాదిగా పంటలపై దాడి

- మొక్కదశలోనే నాశనం చేస్తున్నవైనం
- తీవ్రంగా నష్టపోతున్నరైతులు

అమడగూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నత్త అంటే ఎక్కడో ఒకటో, రెండో కనిపిస్తుంటాయి. అలాంటి నత్తలు లక్షలాదిగా దండుగా ఏర్పడి, పంటలను నాశనం చేస్తున్నాయి. రైతులు లక్షలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలను మొక్కదశలోనే దెబ్బతీస్తున్నాయి. మండలంలోని మహమ్మదాబాద్ పంచాయతీ పరిధి గొల్లపల్లి ప్రాంతంలో లక్షలాది నత్తలు పంటల్లో సంచరిస్తున్నాయి. గ్రామ పరిధిలో 200 ఎకరాలదాకా సజ్జ, మొక్కజొన్న, టమోటా, మిరప, వంకాయ తదితర పంటలు సాగుచేశారు. అన్ని పంటలపైనా నత్తలు ప్రభావం చూపుతున్నాయి. మొక్క దశలో పూర్తిగా తినేస్తున్నాయి. వీటి బారి నుంచి పంటలను ఎలా కాపాడుకోవాలో అర్థంకాక రైతులు దిక్కులు చూస్తున్నారు. ఏడాదిన్నరగా వాటితో నష్టపోతూనే ఉన్నారు. పగలు పంటల్లో ఉంటూ, రాత్రిళ్లు ఇళ్లల్లోకి చొరబడి నిద్రలేకుండా చేస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నత్తల బెడద తప్పించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



మహిళా రైతుతో మాట్లాడుతున్న ఏఓ

నత్తలతో నష్టపోతున్నాం



ఎనిమిది ఎకరాల్లో టమోటా, మొక్కజొన్న సాగుచేశా. భారీ సంఖ్యలో నత్తలు చేరి పంటలను నాశనం చేస్తున్నాయి. పంటలు సాగు చేయాలంటే ఇబ్బందిగా మారింది. వ్యవసాయంతోనే జీవనం సాగిస్తున్నాం.పంటలు సాగు చేయకపోతే ఎలా బతకాలి? -గోపాల్‌రెడ్డి, గొల్లపల్లి

ఇళ్లలోకి చేరి ఇబ్బంది పెడుతున్నాయి



పగలు పంటలో, రాత్రి ఇళ్లలోకి చేరి నిద్ర లేకుండా చేస్తున్నాయి. రోగాల బారిన పడతామేమోనని ఆందోళన చెందుతున్నా. సాగుచేసిన పంటలను మొక్క దశలోనే తినేశాయి. తీవ్రంగా నష్టపోయా. - అమర్‌నాథ్‌రెడ్డి

రెండు పద్ధతుల్లో నివారణ

నత్తలు పొలాల్లోకి చొరబడి పంటలను నాశనం చేస్తున్నది వాస్తవమే. వీటి నివారణకు రెండు పద్ధతులున్నాయి. లీటరు నీటికి 100 గ్రాముల ఉప్పు కలిపి పంటపై కాకుండా నత్తలపై పిచికారీ చేయాలి. రెండో విధానంలో ఎకరాకు 250 గ్రాముల కాపర్ సల్ఫేట్, 250 గ్రాముల ఫెరస్ సల్ఫేట్ డ్రిప్పు ద్వారా కానీ, పిచికారీ చేసినా నత్తల బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చు.

- వెంకటరమణాచారి, ఏఓ, అమడగూరు

సెక్టోరల్స్ ఎంపికపై మళ్లీ వివాదం

విచారణకు కమిటీని నియమించిన కలెక్టర్

అనంతపురం విద్య, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష సెక్టోరల్స్ ఎంపికపై మళ్లీ వివాదం తలెత్తింది. కూటమి సర్కారు కొలువుదీరాక ఏడాదికిపైగా వివిధ కారణాలతో సెక్టోరల్స్ నియామకాలు చేపట్టలేకపోయారు. మునుపటి కలెక్టర్ వినోద్‌కుమార్ ఈ ఏడాది జూలైలో రీ నోటిఫికేషన్ విడుదల చేయించి, ఆగస్టులో ఇంటర్వ్యూలు నిర్వహణకు ఆదేశాలు ఇచ్చారు. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీసీ శైలజ, డైట్ ప్రిన్సిపాల్‌తో కూడిన కమిటీ దరఖాస్తుదారుల్లో అర్హులైన 47 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 42 మంది హాజరయ్యారు. ఆరు సెక్టోరల్స్ పోస్టులకుగాను ఐఈడీ పోస్టుకు అభ్యర్థి కరువయ్యారు. మిగిలిన ఐదు సెక్టోరల్స్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. అందుకు అప్పటి కలెక్టర్ వినోద్‌కుమార్ ఆమోదం తెలిపారు. నలుగురు సెక్టోరల్స్ జాయిన్ అయ్యారు. ఏఎస్‌ఓగా ఎంపికైన అభ్యర్థి నేటికీ జాయిన్ కాలేదు. ఈనేపథ్యంలో ఈ ఎంపిక ప్రక్రియపై కొందరు విమర్శలు గుప్పిస్తున్నారు. ఒక్క పోస్టుకూడా దళిత సామాజికవర్గానికి ఇవ్వలేదని ఆ వర్గాలు.. మండిపడుతున్నాయి. కొత్త కలెక్టర్ ఆనంద్‌ను దళిత సంఘాల నేతలు కలిసి సెక్టోరల్స్ ఎంపికలో అక్రమాలు జరిగాయనీ, తమకు అన్యాయం చేశారని ఫిర్యాదులు చేశారు. దీంతో కలెక్టర్.. సెక్టోరల్స్ ఎంపిక ప్రక్రియపై విచారణకు ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావు, ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారితో కమిటీ వేశారు. ఈ కమిటీ సెక్టోరల్స్ ఎంపికపై విచారణ చేపట్టి, నివేదికలు కలెక్టర్‌కు ఇవ్వనుంది. సమగ్రశిక్ష సెక్టోరల్స్ వివాదం మళ్లీ మొదటికి రావడం విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

నేడు రేగాటిపల్లి రైల్వేగేట్ మూసివేత

ధర్మవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డులో ఉన్న రైల్వేగేట్‌ను గురువారం ఉదయం 8 గంటల నుంచి శుక్రవారం ఉదయం 8గంటల వరకు మూసివేయనున్నట్లు బెంగళూరు డివిజన్ రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేగాటిపల్లి రైల్వే గేట్ మరమ్మతుల కారణంగా రైల్వేగేట్‌ను మూసివేస్తున్నామని పేర్కొన్నారు. పట్టణంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు కూడా సమాచారాన్ని తెలియజేశామని వివరించారు.

29న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీల సమావేశాన్ని ఈ నెల 29 నిర్వహిస్తామని సీఈఓ శివశంకర్ తెలిపారు. దీనికోసం 1 నుంచి 7 వరకు అంశాలకు సంబంధించి అజెండా అంశాలను సిద్ధం చేశామని తెలిపారు. అజెండాలోని అంశాలపై చర్చ జరిపి, తీర్మానాలకు అమోదం తెలుపుతారని వెల్లడించారు. గౌరవ సభ్యులు జడ్పీ కార్యాలయంలో జరిగే సమావేశాలకు హాజరు కావాలని కోరారు.

29న జిల్లాస్థాయి క్రీడాపోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు ఈనెల 29వ తేదీన జిల్లాస్థాయి క్రీడా పోటీలను జిల్లా కేంద్రంలో నిర్వహిస్తామని డీఎస్‌డీఓ అధికారి మంజుల తెలిపారు. అథ్లెటిక్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్, ఖో-ఖో, క్రికెట్ పోటీలను నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో నిర్వహిస్తామని తెలిపారు. ఫుట్‌బాల్, హాకీ, లాన్ టెన్నిస్ పోటీలను ఆర్ట్స్ కాలేజీ మైదానంలో నిర్వహిస్తామని, రెజ్లింగ్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, యోగా, బెస్ట్ ఫిజిక్, డ్యాన్స్ మ్యూజిక్ పోటీలను అశోక్ నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తామని తెలిపారు. ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని స్విమ్మింగ్‌పూల్‌లో స్విమ్మింగ్ పోటీలు ఉంటాయని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరు 5వ తేదీ నుంచి ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు 08554-315632 నంబరులో సంప్రదించాలని కోరారు.

28న సర్పంచ్‌లకు శిక్షణ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు సొంత ఆదాయ వనరులు సమకూర్చుకోవడం గురించి ఈ నెల 28, 29 తేదీలలో శిక్షణ ఇస్తామని జడ్పీ సీఈఓ శివశంకర్ బుధవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండాలల నుంచి ఒక సర్పంచ్, ఒక పంచాయతీ కార్యదర్శి, ఒక డిజిటల్ అసిస్టెంట్, ఒక ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను శిక్షణకు ఎంపిక చేశామని తెలిపారు. ఎంపికైనవారిని తప్పనిసరిగా శిక్షణకు పంపాలని ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓలకు ఆదేశాలు జారి చేశారు.

మరణిస్తూ మరొకరికి కంటిచూపు


గోవిందరెడ్డి (ఫైల్)

చిలమత్తూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మరణిస్తూ నేత్రదానంతో మరొకరికి కంటి చూపు ప్రసాదించడం గొప్ప విషయమనే చెప్పాలి. మనిషి చనిపోయినా నేత్రాలు మరొక జీవితకాలం పాటు ఇతరులకు చూపునిస్తాయి. అలాంటి ఆలోచనతో ఓ యువకుడి తండ్రి తన కుమారుడు చనిపోయాడన్న పుట్టెడు దుఃఖంలోనూ మంచి నిర్ణయం తీసుకుని అభినందనలు అందుకున్నారు. మండలంలోని టేకులోడు గ్రామంలో గోవిందరెడ్డి (32)అనే యువకుడు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.. మృతుడి ఇంటి వద్దకే వైద్యులు వచ్చి రెండు కళ్లను సురక్షితంగా శస్త్రచికిత్స చేసి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మృతుడి తండ్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తన కొడుకు మరణించాడన్న బాధ ఉన్నా అతడి కళ్లు ఇతరులకు చూపు ఇస్తుండటం మరచిపోయేలా చేస్తోందన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యార్థిని ఆచూకీ లభ్యం

రాప్తాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కనిపించకుండా పోయిన విద్యార్థిని అక్షితను పోలీసులు గుర్తించి, ఇంటికి చేర్చారు. మండలంలోని పంగల్‌రోడ్డు సమీపాన గల విన్సెంట్ డీపాల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న అక్షిత మంగవారం అదృశ్యమైన విషయం తెలిసిందే. దీనిపై కుటుంబ సభ్యులు రాప్తాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో రాప్తాడు సీఐ శ్రీహర్ష, పోలీసులు కొన్ని గంటల్లోనే విద్యార్థిని ఆచూకీ కనుగొన్నారు. హిందూపురంలోని ఆర్టీసీ కాలనీలో విద్యార్థిని ఉండగా.. సాంకేతికత సాయంతో ఆచూకీ కనుగొన్నారు. తెల్లవారుజామున 3 గంటలకు విద్యార్థిని వద్దకెళ్లి, క్షేమంగా రాప్తాడు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులకు అప్పగించారు.

టమోటా కిలో రూ.26

అనంతపురం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో బుధవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.26తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.14, సరసరిగా రూ.20తో విక్రయాలు జరిగాయన్నారు. మొత్తంగా మార్కెట్‌కు 1500 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

వాలీబాల్ జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ వాలీబాల్ డివిజనల్ జట్లను ఎంపిక చేశారు. బుధవారం స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో అండర్-17 బాల, బాలికల డివిజన్‌స్థాయి పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జట్ల వివరాలను స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు వెల్లడించారు. బాలుర జట్టుకు భానుతేజ, మంజునాథ్, గోవర్ధన్, లక్ష్మీప్రసన్నకుమార్, వరుణ్‌కుమార్, అభి, భరత్ కుమార్, చరణ్‌యాదవ్, గణేష్, ఈశ్వర్, ఉదయ్‌కిరణ్, ముష్కిన్, బాలికల జట్టుకు అక్షర, లక్ష్మీప్రియ, తుషిత, గుణప్రవల్లిక, కుసుమ, జ్యోతి, నవిత, మానస, నిఖిల, సాయిదర్శిని, శృతికీర్తన ఎంపికయ్యారన్నారు.


వాలీబాల్ బాలికల జట్టు

ఉమ్మడి జిల్లాకు బుల్లెట్ రైళ్లు..!

350 కి.మీ. వేగాన్ని తట్టుకునేలా రైలు మార్గం
తెలుగు రాష్ట్రాల మీదుగా రెండు హైస్పీడ్ ట్రాక్‌లు
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందడుగు
నమూనాల విడుదల



గుంతకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా మీదుగా అత్యున్నతమైన హైస్పీడ్ రైల్వే లైన్‌ను నిర్మించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. ఈ రైలు మార్గం సాకారమైతే అనంతపురం, సత్యసాయి జిల్లాలకు బుల్లెట్ రైళ్ల యోగం పట్టనుంది. రెండు తెలుగు రాష్ట్రాల మీదుగా రెండు హైస్పీడ్ రైలు మార్గాలను నిర్మించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందడుగు వేశాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి బుధవారం రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనమిక్ సర్వీస్ (రైట్స్) సంస్థ నమూనాలను వెల్లడించింది. ఇందులోని సమాచారం ప్రకారం.. తెలుగు రాష్ట్రాల మీదుగా 350 కి.మీ.ల వేగంతో వెళ్లగలిగే అత్యుత్తమ శ్రేణిలో రెండు హైస్పీడ్ రైలు మార్గాలను నిర్మించనున్నారు. హైదరాబాద్-బెంగళూరు (605 కి.మీ.), హైదరాబాద్-చెన్నై (760 కి.మీ.) రైల్ రోడ్లకు రూపకల్పన చేశారు. హైదరాబాద్-బెంగళూరు రైలు మార్గం తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల మీదుగా, హైదరాబాద్-చెన్నై రైలు మార్గం తెలంగాణ, ఏపీ, తమిళనాడు రాష్ట్రాల గుండా నిర్మిస్తారు. ఈ రైలు మార్గాలతో బుల్లెట్ రైలు వెళ్లగలిగే స్థాయిలో ఎల్సీలు లేని, వంద శాతం రక్షిత (ప్రొటెక్టెడ్) అత్యద్భుతమైన లైన్ ఆవిష్కారం కానుంది. ప్రస్తుతమున్న రైల్ ట్రాక్‌పై 130 కి.మీ. వేగంతో రైళ్లను నడపలేమన్న వాస్తవాన్ని అవగతం చేసుకున్న రైల్వే శాఖ ప్రత్యేక హైస్పీడ్ రైలు మార్గాలను నిర్మించే ఆలోచనకు శ్రీకారం చుట్టింది.

అంచనా వ్యయాలు

అనంత ఉమ్మడి జిల్లా మీదుగా వెళ్లే హైదరాబాద్-బెంగళూరు లైన్ నిడివి 605 కి.మీ. కాగా ఇందుకు రూ.2.38 లక్షల కోట్లు వ్యయమవుతుందని అంచనావేశారు. హైదరాబాద్-చెన్నై లైన్ నిడివి 760 కి.మీ.లు కాగా, దీని నిర్మాణానికి రూ.3.04 లక్షల కోట్ల నిధుల అంచనా కట్టారు. ఈ లైన్ రాష్ట్రంలో కర్నూలు జిల్లాలో 46.56 కి.మీ.లు, నంద్యాల జిల్లాలో 37.3 కి.మీ.లు, అనంతపురం జిల్లాలో 86.6 కి.మీ.లు, శ్రీ సత్యసాయి జిల్లాలో 79.08 కి.మీ. మేర నిర్మితం కానుంది. ఇందుకుగాను 988.82 హెక్టార్ల భూమి అవసరమతుందని అంచనా వేశారు. హైదరాబాద్-చెన్నై లైన్ 760కి.మీ. నిర్మించనుండగా.. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 504 కి.మీ.ల లైన్ ఏర్పడనుంది. ఇందుకు మొత్తం మీద 1,873.7 హెక్టార్ల భూమి అవసరం కానుంది.

రైలు మార్గం ఇలా..

హైదరాబాద్-బెంగళూరు హైస్పీడ్ రైలుమార్గాన్ని నిర్మించడానికి స్కెచ్‌ను రూపొందించారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు, భరత్‌సిటీ, మహబూబ్‌నగర్, వనపర్తిరోడ్, కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, దుద్దేబండ, హిందూపురం, కర్ణాటకలోని అలిపుర, దేవనహళ్లి, కొడిహళ్లి మీదుగా లైన్‌ను నిర్మిస్తారు. హైదరాబాద్-చెన్నై లైన్‌ను హైదరాబాద్, శంషాబాద్, భరత్ సిటీ, ఏపీలోని డచ్చిపల్లి, నంబూరు, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి (ఎయిర్‌పోర్టు), చెన్నై ఔటర్ రింగ్ రోడ్, చెన్నై స్టేషన్ల మీదుగా 760 కి.మీ.ల లైన్‌ను నిర్మిస్తారు. ఈ లైన్ ఏపీలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల గుండా వెళ్తుంది.

కార్యాచరణ ఇలా..

ఈ రెండు అత్యుత్తమ స్థాయి హైస్పీడ్ రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణను రూపొందించాయి. తొలుత రైలు మార్గాల భూమి అనుకూల అలైన్‌మెంట్ గుర్తింపు, ఏ స్టేషన్లను నిర్మించాలి అనే దానిపై తుది నిర్ణయం తీసుకుంటారు. తర్వాత భూసేకరణ, అటవీ శాఖ భూమి క్లియరెన్స్ చేపడతారు. రైల్వే స్టేషన్ల నిర్మాణానికి 50 ఎకరాల చొప్పున భూమి సేకరణ, మౌలిక సదుపాయాల కోసం బ్లూప్రింట్ తయారీ, ప్రాజెక్టు సర్వే, నిర్మాణానికి సమన్వయం కోసం రైల్వే, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో నోడల్ టీంలను నియామిస్తారు.

ప్రత్యేక రైళ్లలో లక్ష మందిని గమ్యానికి చేర్చాం

డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పండుగలకు ప్రత్యేక రైళ్లను నడపడం ద్వారా అదనంగా లక్షమంది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చామని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. దసరా, దీపావళి రద్దీని దృష్టిలో ఉంచుకుని, టైం ఆఫ్ డిమాండ్ యోచనతో 66 ప్రత్యేక రైళ్ల ద్వారా 309 ట్రిప్పులను నడిపామని తెలిపారు. గుంతకల్లు రైల్వే డివిజన్ మీదుగా ప్రధాన నగరాలకు ప్రత్యేక రైళ్లలో లక్ష మందిని తరలించామని వివరించారు. 12 రైళ్లకు 19 స్టేషన్లలో తాత్కాలిక స్టాపింగ్‌లను కల్పించామని, ప్రయాణికుల సౌకర్యార్థం హెల్ప్ డెస్క్‌లను కూడా నిర్వహించామని తెలిపారు. పెద్ద రైల్వే స్టేషన్లలో అన్ రిజర్వ్డు టిక్కెట్ కౌంటర్లను, టికెట్ వెండింగ్ యంత్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది ప్రయాణికులకు భద్రతను కల్పించారని తెలిపారు. సమావేశంలో ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీసీఎం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి గుంతకల్లు మీదుగా షోలాపూర్-అనకాపల్లి మధ్య ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. షోలాపూర్-అనకాపల్లి ప్రత్యేక రైలు (నంబర్ 01477) అక్టోబరు 24 నుంచి నవంబరు 28వ తేదీ వరకూ శుక్రవారాలలో, దీని తిరుగు ప్రయాణపు రైలు (01478) అక్టోబరు 25 నుంచి నవంబరు 29వ తేదీ వరకూ శనివారాలో నడుపుతామని తెలిపారు. ఈ రైలు దుధని, గంగాపూర్, కలబురగి, వాడి, యాద్గిర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లి రోడ్డు, పీలేరు, పాకాల, తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, యలమంచిల స్టేషన్ల మీదుగా గమ్యస్థానానికి చేరుకుంటుందని తెలిపారు.

టిడ్కో గృహాలపై కదలిక..!

నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం కసరత్తు
రూ.382 కోట్ల నిధులకు ప్రతిపాదనలు
ఉమ్మడి జిల్లాకు 38 వేల ఇళ్లు మంజూరు
తుది దశకు చేరిన 16,272 ఇళ్ల నిర్మాణాలు
ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం


ఇటీవల టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి, ఏఎంసీ కమిషనర్


అనంతపురంలోని టిడ్కో గృహాలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాల లబ్ధిదారులకు త్వరలో రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పనున్నట్లు సమాచారం. సుమారు ఏడేళ్లుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు గృహాలను స్వాధీనం చేయడానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లోని పేదలకు ఏపీ టిడ్కో (ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) గృహాలను నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు 38,740 ఇళ్లను మంజూరు చేసింది. 16,272 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు టిడ్కోగృహాలను పూర్తిగా విస్మరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలను పూర్తి చేస్తామని ప్రకటించింది. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి రూ.382కోట్లు నిధులు అవసరమవుతాయని టిడ్కో ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. ఇళ్లు కేటాయించకనే ఈఎంఐలు కట్టాలని బ్యాంకుల నుంచి నోటీసులు పంపడంపై పలువురు లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టిడ్కో, అనంత నగరపాలక సంస్థ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో టిడ్కో ఇళ్లపై ఆశలు చిగురించాయి.

38వేల టిడ్కో గృహాలు మంజూరు

2014-19లో ఉన్న అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో ఉండే పేదలకు అపార్ట్‌మెంట్ల తరహాలో టిడ్కోగృహాలు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాకు 38,740 టిడ్కో గృహాలను మంజూరు చేశారు. ఇందులో తాడిపత్రిలో ఫేజ్-1 కింద 3009 ఇళ్లు మంజూరు కాగా 2304, ఫేజ్-2 కింద 3,520 ఇళ్లకు గాను 2,880 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ధర్మవరంలో 8,832 ఇళ్లకు గాను 1440 ఇళ్లు మాత్రమే నిర్మాణం చేపట్టారు. గుత్తికి 398 మంజూరు చేయగా 96 నిర్మాణదశలో నిలిచిపోయాయి. హిందూపురంలో 2,750 ఇళ్లకు గాను 1200 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. కదిరిలో 3,762 ఇళ్లకు గాను 1104 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. పామిడిలో 2,599 ఇళ్లకు గాను 1344 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. పుట్టపర్తిలో 1243 ఇళ్లు మంజూరు కాగా 432 ఇళ్లు ప్రారంభించారు. అనంతపురంలో 6,117 ఇళ్లు మంజూరు చేయగా... 2304 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. గుంతకల్లులో 4,719 ఇళ్లు మంజూరు చేయగా 2,160 ఇళ్ల నిర్మాణ దశలో నిలిచిపోయాయి. రాయదుర్గానికి 1791 ఇళ్లు కేటాయించగా 1008 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోని 11 పట్టణ ప్రాంతాల్లో 38,740 ఇళ్లు మంజూరు చేయగా.. 16,272 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. వీటిలో సుమారు 12వేలకు పైగా గృహాలను పూర్తి చేసి త్వరలో లబ్ధిదారులకు అందజేయడానికి సిద్ధం చేస్తున్నారు.


టిడ్కో ఇళ్ల మధ్యలో ఏపుగా పెరిగిన కంపచెట్లు

గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో టిడ్కో ఇళ్లను పూర్తిగా విస్మరించింది. అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలను పూర్తి చేయాల్సిన వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. దీంతో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలు, విషపురుగులకు అవాసాలుగా మారాయి. చివరి దశలో ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి వైసీపీ ప్రభుత్వంలో పలుమార్లు టిడ్కో అధికారులు ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేశారు. పైగా టీడీపీ ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహాలకు పలు ప్రాంతాలలో వైసీపీ రంగులు వేయడం పట్ల లబ్ధిదారుల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి.

రూ.382.92 కోట్ల నిధులకు ప్రతిపాదనలు

ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాల నిర్మాణాలు పూర్తి చేయడానికి రూ.382.92కోట్లు నిధులు అవసరమవుతాయని ఆశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అనంతపురం జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణానికి రూ.198 కోట్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.55.27 కోట్లు, మురుగు నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటుకు రూ.5.79 కోట్లు, తాడిపత్రిలో మహిళా మార్టుకు రూ.1.63 కోట్లు మొత్తంగా రూ.260.78కోట్లు నిధులు అవసరం ఉందని టిడ్కో ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. సత్యసాయి జిల్లాలో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి రూ.86.68 కోట్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.32కోట్లు, మురుగునీటి శుద్ధి వాటర్‌ప్లాంట్‌కు రూ.3.46 కోట్లు మొత్తంగా రూ.122.14 కోట్లు నిధుల అవసరమవుతాయని ప్రతిపాదనలు అందజేశారు.

కంపచెట్లతో నిండిన సముదాయాలు

గత ప్రభుత్వం గాలికి వదిలేయడంతో టిడ్కో గృహ సముదాయాల్లో కంపచెట్లు పెరిగిపోయి అడవులను తలపిస్తున్నాయి. మరోవైపు వర్షం నీటితో నిండిపోయాయి. అనంత అర్బన్‌కు సంబంధించి ఏపీ టిడ్కో గృహ సముదాయం చిన్మయనగర్‌లో నిర్మిస్తున్నారు. అనంత నగరపాలక సంస్థ పరిధిలో 5వేల ఇళ్లకు 2304 ఇళ్లు నిర్మాణ దశకు చేరాయి. ఇళ్ల నిర్మాణం అలా ఉంచితే.. ఏపుగా పెరిగిన కంప చెట్లు ఓ వైపు, మరోవైపు వర్షపు నీరు చేరి కుంటను తలపిస్తోంది. కంపచెట్లను తొలగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఆందోళన వద్దు..



ఏపీ టిడ్కో లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. లబ్ధిదారుల ఆశలు, ఆలోచనలకు అనుగుణంగానే ప్రభుత్వం టిడ్కో గృహాలను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇటీవల ప్రభుత్వం లబ్ధిదారుల జాబితాను అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు మున్సిపల్ ఇంజనీర్లు, టిడ్కో అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో నిర్మాణ సముదాయాలను పరిశీలించి తుది నివేదికను ప్రభుత్వానికి పంపారు. నివేదిక ఆధారంగా రెండు మూడు నెలల్లో లబ్ధిదారులకు టిడ్కో గృహాలను అందజేయనుంది.

-రాజశేఖర్, ఎస్ఈ, అనంతపురం నగరపాలక సంస్థ

త్వరలోనే శుభవార్త వింటారు..



ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న టిడ్కో గృహ లబ్ధిదారులు త్వరలో శుభవార్త వింటారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. టిడ్కో, మున్సిపల్ ఇంజనీర్ల ప్రతిపాదనల మేరకు నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉంది. ఇప్పటికే టిడ్కో గృహాల లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపులు, ఆలస్యంపై అవగాహన కల్పిస్తున్నాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి.. వాటి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. లబ్ధిదారులకు పూర్తి నిర్మాణం, కనీస వసతులు మురుగుకాలవలు, రోడ్లు, మంచినీటి వసతి కల్పించి అందజేస్తాం.

-సుధారాణి, టిడ్కో ఈఈ, ఉమ్మడి అనంతపురం జిల్లా

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రాయదుర్గం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మద్యం కోసం డబ్బులు ఇవ్వలేదని భార్యను హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. డీ. హీరేహాళ్ మండలం మురడి గ్రామంలో మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని హనుమంతరాయుడు తన భార్య నాగమణిని గొడ్డలితో నరికి చంపిన కేసులో అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మురడి గ్రామానికి చెందిన హనుమంతరాయుడు రాయదుర్గం మండలం టి.వీరాపురం గ్రామానికి చెందిన నాగమణిని పెళ్లి చేసుకున్నాడు. మద్యానికి బానిసై డబ్బులు ఇవ్వలేదని నిత్యం గొడవపడుతుండేవాడు. ఈ నెల 20న నిద్రపోతున్న భార్య నాగమణిని చంపేసినట్లు పోలీసుల ఎదుట నిందితుడు హనుమంతరాయుడు నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రాయదుర్గం సివిల్‌కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

ఎక్సైజ్ పోలీసులపై దాడి

అల్లీపూర్ తండాలో తనిఖీలు చేస్తుండగా ఘటన
కేసు నమోదు


గాయపడిన వెంకటనారాయణ

కదిరి అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తనిఖీలకు వెళ్లిన ఎక్సైజ్ పోలీసులపై గ్రామస్థులు దాడిచేసిన ఘటన కదిరి మండలం అల్లీపూర్ తండాలో చోటు చేసుకుంది. కదిరి అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు బుధవారం నాటుసారా తయారు చేస్తున్నారన్న సమాచారంతో అల్లీపూర్‌తండాకు వెళ్లారు. గ్రామంలో రమణమ్మ ఇంట్లో సోదాలు చేస్తుండగా.. ఆమెతో పాటు గ్రామానికి చెందిన వెంకటేష్‌నాయక్, రవీనాయక్, మరికొంతమంది గ్రామస్థులు తమ గ్రామానికి వచ్చి తనిఖీలు చేస్తారా అంటూ తిరగబడి కట్టెలతో దాడి చేశారు. దాడిలో ఎక్సైజ్ కానిస్టేబుల్ వెంకటనారాయణ తలకు గాయమవ్వగా.. మరో కానిస్టేబుల్ వెంకటప్రసాద్‌కు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన కానిస్టేబుళ్లను కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణలో భాగంగా గ్రామానికి వెళ్లిన ఎక్సైజ్ పోలీసులపై దాడికి పాల్పడ్డ రమణమ్మ, వెంకటేష్‌నాయక్, రవీనాయక్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా 16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిగా రూ.10వేలు పలికాయన్నారు.

నిండుకుండలా సీజీ ప్రాజెక్ట్



తనకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముండ్లవారిపల్లి సమీపంలో పాపాఘ్నినదికి అడ్డంగా నిర్మించిన చెన్నరాయస్వామి గుడి ప్రాజెక్ట్ నిండుకుండా దర్శనమిస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 27 అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 26.12 అడుగులకు నీరు చేరింది. ప్రాజెక్ట్ నీటి సామర్థ్యం 170 ఎంసీఎఫ్‌టీగా ఉంది. బుధవారం రాత్రి పొద్దుపోయిన తరువాత గానీ, గురువారం ఉదయం కానీ గేట్లు ఎత్తే అవకాశం ఉన్నట్ల ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. రెండు రోజులుగా ఎగువ ప్రాంతమైన కర్ణాటకలో, అమడగూరు మం డలంలో భారీగా వర్షాలు పడుతుండటంతో వందమానేరు ద్వారా సీజీ ప్రాజెక్ట్‌లోకి నీరుచేరినట్లు తెలిపారు.

చాయ్ కేఫ్‌లో చోరీ

కదిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోనేరు సమీపంలో ఉన్న దక్కన్ చాయ్ కేఫ్‌లోకి గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ప్రవేశించారు. కౌంటర్ బాక్స్‌లో ఉన్న రూ. 12వేలు నగదు, రూ. 10వేలు చేనసే సిగరెట్ ప్యాకెట్లు ఎత్తుకెళ్లారు. కేఫ్ యజమాని నరేష్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

ట్రైనీ ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

గాండ్లపెంట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌లో ట్రైనీ ఎస్ఐగా క్రాంతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ట్రైనీ ఎస్సైగా పని చేస్తున్న రవికుమార్ పుట్టపర్తికి వెళ్లారు. ఆయన స్థానంలో తనను నెల పాటు నియమించినట్లు ఆయన తెలిపారు.

వరిపొలాల్లోకి కాలువ నీరు

ధర్మవరం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నూరుబత్తలపల్లి వరిపొలాల్లోకి రావులచెరువుకు వెళ్లే కాలువనీరు వెళుతుండటంతో సాగురైతులు ఇబ్బందులు పడుతున్నారు. రావులచెరువుకు ధర్మవరం చెరువు నుంచి నీరు విడుదల చేశారు. చెరువుకు వెళ్లే కాలువ గడ్డితో కుంచించిపోవడంతో కాలువలో నీరు వెళ్లక వరిపొలాల్లోకి వెళ్తోందని రైతులు అంటున్నారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన

కదిరి అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం మునిసిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రదాన కార్యదర్శి అంజినేయులు మాట్లాడుతూ... కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. నాయకులు నాగరాజు, సూరి, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

ధర్మవరం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):బాల్యవివాహ రహిత మండలంగా తీర్చిదిద్దుదామని అందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ సాయిమనోహర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గిరకరమాదేవి అధ్యక్షతన మండలసర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు.

సోంపల్లి వెంగమ్మకు పల్లె నివాళి



వెంగమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పల్లె రఘునాథరెడ్డి

కొత్తచెరువు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన శ్రీవిద్యాసంస్థల అధినేత సూర్యప్రకాశ్ తల్లి సోంపల్లి వెంగమ్మ ఈ నెల 19న మృతిచెందింది. ఆమె మూడో కుమారుడు వెంకటాచలపతి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన అమెరికా నుంచి వచ్చాక బుధవారం అంతక్రియలు నిర్వహించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆమె సమాధి వద్దకు వెళ్లి పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కొత్తచెరువు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నల్లమాడ మండలానికి చెందిన కుళ్లాయనాయక్ కొత్తచెరువు మీదుగా ద్విచక్ర వాహనంలో పెనుకొండకు బయలుదేరాడు. లోచర్ల వద్ద ద్విచక్రవా హనం అదుపు తప్పి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో అతడిని కొత్తచెరువు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అప్రమత్తంగా ఉండాలి: ఆర్డీఓ

ధర్మవరం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వల్ల రానున్న మూడురోజుల పాటు అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ సురేష్‌బాబు పేర్కొన్నారు. వారు బుధవారం ధర్మవరం చెరువుతో పాటు పోతుల నాగేపల్లి చిత్రావతి నది, రేగాటిపల్లి, గొట్లూరు చెరువులలో నీటి మట్టాన్ని పరిశీలించారు. చెరువులన్నీ ఇప్పటికే 80శాతంపైగా నిండాయని, కుంటలు, చెరువుల గట్లు తెగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ధర్మవరం రెవెన్యూ డివిజన్ వ్యాప్తంగా ఆర్డీఓ కార్యాలయంతో పాటు ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. అవసరమైతే ఆర్డీఓ కార్యాలయం కంట్రోల్ నెంబర్ 9866057959, ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం నెంబర్ 9553929724కు సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట వీఆర్ఓలు రవిశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్ తదితరులు ఉన్నారు.

● నంబులపూలకుంట: అల్పపీడన ప్రభావంతో మూడు రోజుల పాటు మండలంలో వర్షాలు భారీగా కురవనున్నాయనీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ దేవేంద్రనాయక్ సూచించారు. మండలంలోని పెడబల్లి జలాశయం, పరిసర ప్రాంత్రాలను పరిశీలించారు. ఎగువన ఉన్న సిజి ప్రాజెక్ట్ గేట్లు తెరవనున్నారనీ, పెడబల్లి జలాశయంనిండే అవకాశం ఉందన్నారు. మండలంలో ఎటువంటి ప్రమాదం పొంచి ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

తాగునీటి సమస్యపై ఆందోళన

నంబులపూలకుంట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దాదాపు 20రోజులుగా తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని మండలపరిధిలోని తాటిమానిగుంత వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. తాగనీటి సమస్య పరిష్కరించే వరకు కదిలేది లేదన్నారు. ఎంపీడీఓ పార్థసారథి అక్కడికి చేరుకుని మోటారు మరమ్మతులతో పాటు కొత్తబోరు వేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం వారు తహసీల్దార్ కార్యాలయం చేరుకొని సోలార్ కోసం భూములను ఇస్తే ఉపాధి కోల్పోతామని తహసీల్దార్ దేవేంద్ర నాయక్‌కు విన్నవించారు. మూగ జీవాల పెంపకంతో జీవిస్తున్నామ గ్రాసం కరువైతుందన్నారు. సోలార్‌కు తమ భూములు ఇవ్వలేమని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఏటీఎం కార్డు మార్చి డబ్బు కాజేత

కదిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సైదాపురంలో నివాసముంటున్న గోపినాయక్ ఈ నెల 11న సాయంత్రం స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఏటీఎం నుంచి డబ్బు తీసుకుంటున్నాడు. అక్కడికి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి అతడిని మాటల్లో పెట్టి, పక్కన పెట్టి ఏటీఎం కార్డు మార్చివేసి వెళ్లి పోయాడు. అనంతరం తన ఖాతా నుంచి రూ. లక్ష కాజేసినట్లు గోపినాయక్ బుధవారం ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

ఆక్రమణదారులకు రెండో నోటీసు జారీ



నోటీసు ఇస్తున్న పంచాయతీ అధికారులు

చిలమత్తూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కోడూరు మన్రో తోపు ఆక్రమణదారులకు బుధవారం రెండో అత్యవసర నోటీసులను పంచాయతీ అధికారులు అందజేశారు. ఇష్టానుసారంగా స్థలాలను ఆక్రమించుకొని కబ్జాలకు పాల్పడినట్లు అధికారుల సర్వేలో తేలడంతో సంబంధిత పంచాయతీ అధికారులు ఈనెల 15న మొదటి నోటీసుని జారీ చేశారు. నోటీసు అందిన ఏడు రోజుల్లోగా ఆక్రమణలను తొలగించుకోవాలని సూచించారు. లేని పక్షంలో పంచాయతీ వారు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అయితే నోటీసు తీసుకున్న వారు స్పందించలేదు. దీంతో బుధవారం మరోసారి అత్యవసర నోటీసులు అందజేశారు. ఈ నోటీసు ప్రకారం ఆక్రమణలను మూడు రోజుల్లో తొలగించుకోవాలనీ, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ అధికారులు నోటీసులు ఇస్తూ హెచ్చరిస్తున్నా ఆక్రమణదారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించండి

ఎంపీడీఓ వెంకటలక్ష్మి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సోమందేపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల ఆరోగ్యంపట్ల శ్రద్ధవహించాలని ఎంపీడీఓ వెంకటలక్ష్మీ సూచించారు. మండలంలోని పాపిరెడ్డిపల్లి వద్ద ఉన్న కేజీబీవీని బుధవారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థినులకు వడ్డిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించారు. వంటగది, స్టోర్‌రూమ్, హాస్టల్ గదులను తనిఖీచేశారు. వంటకు ఉపయోగిస్తున్న కూరగాయలు, రేషన్‌ను పరిశీలించారు. విద్యార్థినులు భోజనం చేస్తున్న పరిసరాల శుభ్రత పరిశీలించి అనంతరం విద్యార్థులతో మాట్లాడి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, విద్యార్థులు ఆరోగ్యంపట్ల శ్రద్ధవహించాలన్నారు. మెనూ ప్రకారం భోజనాన్ని వడ్డించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓ అనిత తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా ఉండాలి..!

● ఆర్డీఓ ఆనంద్ కుమార్



కొడికొండ వద్ద చిత్రావతి నదిని పరిశీలిస్తున్న ఆర్డీఓ ఆనంద్ కుమార్

చిలమత్తూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. నదులు, వాగులు, వంకలు పొంగి పొర్లే అవకాశం ఉందని, పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిలమత్తూరు మండలంలో చిత్రావతి నది, బలిజిపల్లి, కొడికొండ చెరువులను పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్ బుధవారం పరిశీలించారు. నాలుగు రోజులు వర్షాలు ఉన్నందున చిత్రావతి, కుషావతి నదులు ఉధృతంగా పారే అవకాశం ఉందని ఆయన తెలిపారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నదులు దాటే ప్రయత్నం చేయరాదని అన్నారు. రాత్రి పూట ప్రయాణం చేసేవారు మరింత జాగ్రత్తగా ఉండాలని కోరారు. పాత మిద్దెల్లో నివాసం ఉండొద్దని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకోవాలని సూచించారు. జడివానలకు మిద్దెలు కూలడం, విద్యుత్ ప్రమాదాల వంటివి పొంచి ఉంటాయని హెచ్చరించారు. రైతులు మోటార్లు ఆన్ చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ స్తంభాలను తాకవద్దని సూచించారు.

అప్రమత్తత అవసరం: తహసీల్దార్

గుడిబండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో రెండురోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీధర్ సూచించారు. బుధ, గురువారాలు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురువనుందన్న హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొర్రెలు, మేకలు, పశువులు కాపర్లు చెట్లకింద, రాళ్లకింద కూర్చోకూడదన్నారు. మండలంలోని మోరుబాగల్ చెరువును ఆయన పరిశీలించారు. ఆయన వెంట వీఆర్ఓ త్యాగరాజు, రామప్ప, సర్వేయర్ దేవన్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులు రాకుండా చూడండి

ట్రాన్స్‌కో ఎస్ఈ సంపత్ కుమార్

హిందూపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని, ఎక్కడా ఫిర్యాదులు రాకుండా చూడాలని విద్యుత్ శాఖ ఉద్యోగులకు ఆ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ సూచించారు. పట్టణంలోని విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయంలో పెనుకొండ, మడకశిర, హిందూపురం, డీఈఈలు, డీఈ, ఏడీ, ఏఈలతో బుధవారం సమీక్ష నిర్వహించారు. లో ఓల్టేజి సమస్య రాకుండా అవసరమైన చోట్ల డీసీఆర్ఎస్ ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసు కనెక్షన్‌లో జాప్యం జరగకూడదని, నిబంధనల మేరకు తక్షణమే వారికి పరికరాలు ఇవ్వాలని ఆదేశించారు. గృహ విద్యుత్ వినియోగదారులకు నచ్చజెప్పి, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పీఎం సూర్యఘర్‌పై వినియోగదారులకు అవగాహన పెంచాలని అన్నారు. వినియోగదారులపట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. వీధి దీపాలకు స్విచ్ కంట్రోల్ ఏర్పాటు చేయాలని, వీధి దీపాల లైన్ లేనిచోట కొత్త లైను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ బకాయిలు వందశాతం వసూలు చేయాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది పనిచేసేచోటే నివాసం ఉండాలని అన్నారు. సమావేశంలో ఏఈ శ్రీధర్‌రెడ్డి, మూడు నియోజకవర్గాల విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్ఈ సంపత్‌కుమార్

పొంచి ఉన్న ప్రమాదం

జోరుగా ఆక్రమణలు
కుంచించుకుపోతున్న పెద్దవంక



పట్టణ సమీపంలో పెద్దవంకపై చేపడుతున్న నిర్మాణాలు

మడకశిర రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణానికి పెనుప్రమాదం పొంచివుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పెద్ద వంక వద్ద రోజురోజుకూ ఆక్రమణలు ఎక్కువ అవుతుండటంతో ఆ వంక కుచించుకుపోతోంది. భారీ వర్షాలు సంభవిస్తే నీరు మొత్తం పట్టణంలోకి చేరే ప్రమాదం ఉందని పట్టణవాసులు అంటున్నారు. పెద్ద వంక గుడిబండ మండలం భూతప్పకనుమ నుంచి ప్రారంభమై కనుమ సమీపంలోని కదిరేపల్లి, బేగార్లపల్లి, మెట్టబండ పాళ్యం, మడకశిర పట్టణ సమీపం నుంచి వడ్రపాళ్యం, చీపులేట్లి నుంచి గౌడనహళ్లి, దెయ్యాలపల్లి చెరువులకు నీరు చేరుతోంది. దాదాపు 16 కిలోమీటర్లు వంక ప్రవహిస్తోంది. అయితే ప్రారంభంలో దాదాపు 60 అడుగులు వెడల్పు ఉండే వంక పట్టణ సమీపంలోకి రాగానే 10 నుంచి 15 అడుగులకు కుచించుకుపోయింది. దీనికి కారణం ఆక్రమణలేనని పట్టణవాసులు అంటున్నారు. గతంలో ఈ పెద్దవంక పట్టణానికి కిలోమీటరు దూరంలో ఉండేది. అయితే పట్టణం అభివృద్ధి చెందుతుండటంతో ప్రస్తుతం వంక పట్టణానికి మధ్యలో ఉంది. దీంతో వంకకు ఇరువైపులా ఆక్రమణలు ఎక్కువయ్యాయని ప్రజలు వాపోతున్నారు. గతంలో భారీగా వర్షాలు రావడంతో ఎగువప్రాంతం నుంచి పెద్దవంకకు నీరురావడంతో కట్టలు తెగి నీరు పట్టణంలోకి చేరింది. ఇళ్లలోకి, సినిమాథియేటర్‌లోకి నీరు చేరిన ఘటనలు కూడా ఉన్నాయి. లోతట్టులో ఉండే ప్రాంత ప్రజలు మరీ భయభ్రాంతులకు గురయ్యారు. ఆ సమయంలో వారి బాధలు వర్ణనాతీతం. ప్రస్తుతం ఆక్రమణలు ఎక్కువ కావడంతో పెద్దవంక కుచించుకుపోయిందని, భారీగా వర్షం వస్తే తమ పరిస్థితి ఏంటని లోతట్టుప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



చెరువులు, వంకలు, కాలువలు ఆక్రమణలకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో లోతట్టుప్రాంతాలు భారీ వర్షాలు సంభవిస్తే జలమయమవుతాయి. ఆప్రాంత వాసులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పెద్దవంక ద్వారా మా చెరువులకు నీరు వస్తుంది. ఆ వంక ఆక్రమణలతో కుచించుకుపోతే మాకు నీరు రాదు. అధికారులు ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

-శివకుమార్, రైతు, గౌడనహళ్లి

చర్యలు తీసుకుంటాం

చెరువులు, వంకలు, కాలువలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం. పెద్దవంక వంక ప్రవహించే ప్రదేశం నుంచి చివరి వరకు వంకను పరిశీలిస్తాం. ఎక్కడైనా ఆక్రమణలు చేపట్టి వుంటే చర్యలు తీసుకుంటాం.

-శ్రీనివాసులు, ఏఈ, ఇరిగేషన్ శాఖ, మడకశిర

డీఎం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు

ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు
ఎర్రబ్యాడ్జీలు ధరించి డిపో గేటు వద్ద నిరసన



ఆర్టీసీ డిపోగేటు వద్ద ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

హిందూపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఆర్టీసీ డిపోమేనేజర్ అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు ఎర్రబ్యాడ్జీలు ధరించి బుధవారం విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిపోగేట్‌వద్ద జరిగిన కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ నాయకులు నారాయణస్వామి, డిపో కార్యదర్శి మల్లికార్జున, గ్యారేజ్ కార్యదర్శి ఇర్షాదుల్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం డిపోలో విజయవంతంగా అమలు కావడాన్ని ఎంప్లాయిస్ యూనియన్ నాయకుల పూర్తీ సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. అయితే డీఎం ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఉద్యోగుల్లో అశాంతి నెలకొల్పుతున్నాడన్నారు. ముఖ్యంగా డ్రైవర్లు, కండక్టర్లకు కొత్త డ్యూటీచార్ట్ వేయాలని చూస్తున్నాడన్నారు. డ్యూటీ చార్ట్‌లో జరుగుతున్న అవకతవకలు సరిచేయాలన్నారు. ఒకే యూనియన్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న కంట్రోలర్‌ను తొలగించాలన్నారు. స్త్రీశక్తి పథకం వల్ల ప్రయాణికుల రద్దీకారణంగా డీజల్, కెఎంపిఎల్‌పై వేధింపులు మానుకోవాలన్నారు. ఆర్టీసీ కార్మికుల పదోన్నతుల విషయంలో జీఓ విడుదల చేయడంపై ముఖ్యమంత్రి, రవాణాశాఖ మంత్రి ఆర్టీసీ ఎండీకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, రూపేంద్ర కుమార్, మోహన్, ప్రభావతి, నాగరత్న, వెంకటేశ్, అశ్వత్థనారాయణ, విజ్ఞేశ్వర, నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన చెట్లకు నిప్పు

● పట్టించుకోని అధికారులు



నిప్పు పెట్టడంతో రోడ్డుపక్కనే ఎండిన చెట్లు

రొద్దం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాగిమేకలపల్లి గ్రామం వద్ద రాచూరుకు వెళ్లేదారిలో ఆర్అండ్‌బి రోడ్డుపక్కన ఏపుగా పెరిగి ఆహ్లాదకరంగా ఉన్న చెట్లకు నిప్పుపెట్టినా సంబంధితశాఖాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రొద్దం మండల పరిధిలోని రాగిమేకలపల్లివద్ద ఎనిమిది చెట్లకు నిప్పు పెట్టడంతో ఎండిపోయాయి. పదేళ్ల క్రితం రోడ్డుపక్కన ఉపాధిహామీ కింద అటవీచెట్లు నాటారు. అవి ఏపుగా పెరిగాయి. అయితే గుర్తు తెలియని వ్యక్తులు పెద్దచెట్లకు నిప్పుపెట్టి ఒక్కొక్కటిగా కాల్చివేస్తున్నా పంచాయతీ, రెవెన్యూ, ఫారెస్ట్, ఆర్అండ్‌బి, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న యాజమాన్యం

హిందూపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పాంచజన్య పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సన్నిధి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 18న అనంతపురంలో జరిగిన జిల్లాస్థాయి అండర్-19 షెటిల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభను కనబరచి విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. తమ పాఠశాల నుంచి విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని శ్రీనివాసులు పేర్కొన్నారు. విద్యార్థినిని బుధవారం అభినందించారు. అభినందించినవారిలో హెచ్‌ఎం గాయత్రి, ఏఓ భాస్కర్ ఉన్నారు.

సమస్యలపై ఆరా

పెనుకొండ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ ఇస్లాపురం గ్రామంలో టీడీపీ నాయకులు సమస్యలపై బుధవారం ఆరాతీశారు. మండల కన్వీనర్ శ్రీరాములు, టీడీపీ నాయకులు గ్రామంలో పర్యటించి వీధి దీపాలు, డ్రైనేజీలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలో పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హనుమంతు, టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, ప్రభంజన్, బోయచంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

'బాల్య వివాహాలను నిరోధించండి'

సోమందేపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిరోధించాలని సీడీపీఓ శాంతలక్ష్మి పేర్కొన్నారు. గోరంట్ల మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో సీడీపీఓ ఆధ్వర్యంలో సచివాలయ పోలీసు ఉద్యోగులకు బేటీబచావ్, బేటీపడావ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలపై అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లల ఎదుగుదలను పరిశీలించాలన్నారు. ఎంపీడీఓ కమలాబాయి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ సేవలు ప్రజలకు అందేలా చూడాలన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

మడకశిరటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఎంపికైన కరుణాకర్‌ను ఎంజేపీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బషీరు న్నీసా, మాజీ సర్పంచ్ చంద్రప్ప బుధవారం సన్మానించారు. తమ కళాశాలలో అధ్యాపకుడిగా ఉన్న కరుణాకర్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించినందుకు సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలని సూచించారు.

రహదారికి మరమ్మతులు

రొద్దం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి బీసీ కాలనీ రహదారి బురదమయంగా మారింది. విషయం తెలుసుకున్న మంత్రి సవిత ఎక్స్‌కావేటర్ సాయంతో గరుగుమట్టిని వేయించి చదును చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాంకుమార్, టీడీపీ నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, చంద్రమౌళి, సింగిల్‌విండో అధ్యక్షులు వీరాంజనేయులు, నరసింహులు, సర్పంచ్ మంజు తదితరులు పనులను పర్యవేక్షించారు.

మరువ పారుతున్న తురకలాపట్నం చెరువు

రొద్దం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో తురకలాపట్నం చెరువు మరువపారుతోంది. ఈ ఏడాది కురిసిన భారీ వర్షం ఇదేనని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కరోజు కురిసిన వర్షంతోనే తురకలాపట్నం చెరువు మరువపారింది. దీంతో రొద్దం పెద్దచెరువుకు నీరు చేరుతున్నాయి. మంగళవారం రాత్రి, గురువారం ఉదయం రొద్దం మండలంలో వర్షం కురిసింది. అనేక చెరువుల్లోకి కొంతమేర నీరు చేరింది. రొద్దంలో వర్షం కారణంగా కూరగాయల మార్కెట్‌లో నీరు అధికంగా చేరి వ్యాపారస్థులు, దుకాణదారులు ఇబ్బందులు పడ్డారు. నాలుగు నెలలుగా సరైన వర్షం రాకపోవడంతో కందిపంట రైతులు దిగాలు చెందగా భారీ వర్షాలు కురుస్తుండటంతో కందిపంటకు ప్రాణం పోసినట్లయింది.



మరువపారుతున్న చెరువు

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రోడ్ల నిర్మాణానికి పంచాయతీరాజ్‌శాఖ రూ.15 కోట్ల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ గుడిబండ మండలంలో రూ.2.20కోట్లతో ఆరు రోడ్ల నిర్మాణం, అగళి మండలంలో రూ.3కోట్లతో ఎనిమిది సీసీ రోడ్లు, అమరాపురం మండలంలో రూ.3కోట్లతో ఆరు బీటీరోడ్లు, మడకశిర మండలంలో రూ.3కోట్లతో బీటీరోడ్లు, రొళ్ల మండలంలో రూ.3కోట్లతో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక రహదారులకు మహర్దశ వచ్చిందన్నారు. గుంతలమయంగా ఉన్న రహదారులను అద్దంలా మారుస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా అభివృద్ధిని మాత్రం కొనసాగిస్తూ ముందుకు సాగుతున్నారని అన్నారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు శ్రమిస్తున్నారని అన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేస్తూ యువతకు ఉపాధి మార్గాలు చూపుతూ అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్నారని అన్నారు.

నియోజకవర్గానికి చేయూతనివ్వండి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి



ధర్మాధికారి వీరేంద్ర హెగ్డేతో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి చేయూతనివ్వాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ధర్మస్థల మంజునాథస్వామి మఠాధిపతి వీరేంద్రహెగ్డేను కోరారు. బుధవారం గుండుమల తిప్పేస్వామి మఠాధిపతి కలిసి నియోజకవర్గం మారుమూల ప్రాంతం కావడంతో దత్తత తీసుకుని మౌలిక సదుపాయాల కల్పనలో చేయూతనివ్వాలని కోరారు. విద్య, వైద్యం, తాగునీరు తదితర సదుపాయాలను కల్పించాలన్నారు. అదేవిధంగా పలు అంశాలపై ఆయన మఠాధిపతితో మాట్లాడారు. తాను ప్రస్తావించిన అంశాలపై వీరేంద్రహెగ్డే సానుకూలంగా స్పందించినట్లు గుండుమల తిప్పేస్వామి తెలిపారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం



నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లతో మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు ఉమేష్

అగళి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బుధవారం సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగానే సాగింది. సమావేశం ఎంపీపీ రేణుక కామరాజ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు తమ ప్రగతి నివేదికను వినిపించారు. ఏపీఓ మంజునాథ్ మాట్లాడుతూ ప్రతి కూలి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. మండలంలో రెండు విడుతలుగా 342హెక్టార్లలో పండ్లతోటల పెంపకం చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. తహసీల్దార్ సుబ్బారావు మాట్లాడుతూ మండలంలో 10,470 రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందన్నారు. ఇంటి పట్టాల కోసం 2049 మంది దరఖాస్తు చేసుకోగా.. 1,436 మందికి సంబంధించి పట్టాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరైనా తాము చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని సర్పంచులు నిరసన తెలిపారు. జడ్పీటీసీ ఉమేష్, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ వారికి సర్దిచెప్పారు. బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దావతి మాట్లాడుతూ.. 8 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. నాలుగు సెంటర్లకు హెల్పర్ కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. జడ్పీటీసీ ఉమేష్ మాట్లాడుతూ ఏపీలో గూగుల్ ఒప్పందం చారిత్రాత్మకమన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు కుమారస్వామి, వైస్ ఎంపీపీ గాయిత్రి, హేమంత్‌రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ విజయ్‌కుమార్, ఎంఈఓ కృష్ణమూర్తి, రాజు, టీడీపీ ఎంపీటీసీ రంగమ్మ, వ్యవసాయ శాఖ అధికారి నాగరాజు, డాక్టర్ శివానంద పాల్గొన్నారు.

యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాధాకృష్ణ



నియామక పత్రాన్ని రాధాకృష్ణకు అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు

మడకశిర టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా న్యాయవాది గుండుమల రాధాకృష్ణను నియమించినట్లు జిల్లా అధ్యక్షులు లక్ష్మీనరసప్ప బుధవారం తెలిపారు. నియామక పత్రాలను రాధాకృష్ణను కలిసి అందజేశారు. ఈనెల 19వతేదీన కాకినాడలో అఖిలభారత యాదవ మహాసభలు జరిగాయని, అందులో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. రాధాకృష్ణను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడంతో సంఘం నాయకులు ప్రత్యేకంగా రాధాకృష్ణకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర అధ్యక్షులు వెంగళరావుకు ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

క్లస్టర్ ఇన్‌చార్జిగా చంద్రశేఖర్ యాదవ్



గుడిబండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గుడిబండ మండలం తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జిగా చంద్రశేఖర్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను నియమించేందుకు కృషిచేసిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీగుండుమల తిప్పేస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానని పేర్కొన్నారు.

అనారోగ్యంతో జూనియర్ అసిస్టెంట్ మృతి

గుడిబండ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లక్ష్మీనారాయణ నాయక్ అనారోగ్యంతో మృతిచెందారు. వారంరోజులుగా ఆరోగ్యం సరిగాలేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ప్రధానోపాధ్యాయుడు గోవిందప్ప, సిబ్బంది స్వగ్రామమైన ఎమ్మెఎస్ తండాకు వెళ్లి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వం నుంచి రూ.25వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు.

మొక్కజొన్నకు పందుల బెడద

పెనుకొండ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటలపై పందుల బెడద అధికమైందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెనుకొండ మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో విస్తారంగా మొక్కజొన్నను సాగుచేశారు. చేతికొచ్చిన పంటలపై రాత్రివేళల్లో అడవిపందులు దాడిచేసి నాశనం చేస్తుంటే తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.